క్లుప్తంగా

వాహనాల వేలం రేపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 11 ద్విచక్ర వాహనాలు (ఒక స్కూటీ, 10 మోటార్ సైకిల్స్) 2 కార్లు ఈ నెల 29న వేలం వేయనునట్లు పట్టణ సీఐ కృష్ణారావు ఒక ప్రకటలో తెలిపారు. ఈ మేరకు ఉత్సాహవంతులు ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్‌లో పాల్గొని, వాహనానికి నిర్ణయించిన అఫ్‌సెట్ ప్రైజ్‌కు తక్కువ కాకుండా నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొని, వాహనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రేపు

ప్వార్తీపురంటౌన్: ఈనెల 29న ఉదయం 11గంటలకు పార్వతీపురం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ప్రైవేటు కళాశాలలపై విచారణ చేయాలి

కురుపాం: కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో ఉన్నటువంటి ప్రైవేటు ఇంటర్మీడియెట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలపై జిల్లా అధికారులు స్పందించి దర్యాప్తు చేయాలని ఆదివాసీ గిరిజన అభ్యుదయ, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు ఆరిక చంద్రశేఖర్, పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేయటమే కాకుండా, ఆయా కళాశాలల్లో అధ్యాపకుల పేర్లు ఒకరివి, విద్యార్థులకు బోధిస్తున్నది మరొక వ్యక్తులని, మూడు కళాశాలల్లో ఎటువంటి సరైన బోధనా సిబ్బంది, ల్యాబ్స్, గదులు లేవని పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. ఆదివారం మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, కొమెర గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేపై ఆయన ఆరాతీశారు. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు కలిసి ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ఎవరైనా జ్వరపీడితులు ఉంటే వివరాలు నమోదు చేయాలని, అలాగే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు.

సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించాలి

రేగిడి: డ్వాక్రా సంఘాల్లోని మహిళలంతా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం టి.మంగమ్మ కోరారు. ఆదివారం మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస తదితర గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల పనితీరుపై ఆమె ఆరాతీశారు. అనంతరం స్త్రీనిధి రుణాలు, పీఎంఈజీపీ రుణాలు పొందే విధానాన్ని తెలిపారు.

భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవనవిధానం

రేగిడి: భగవద్గీత పఠనం ద్వారా ఉత్తమ జీవన విధానం అలవడుతుందని ఆధ్యాత్మిక వక్తలు త్రినాథరావు, ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామ గీతాశ్రమంలో పీఠాధిపతి దామోదరరావు స్వామీజీ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక సభ ఆదివారం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ భగవద్గీత మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, గీతాపారాయణం మనిషి నడవడికలో మార్పు తీసుకువస్తుందని, జీవిత సత్యాన్ని గ్రహించేలా చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాలని, అందులో సారాంశాన్ని గ్రహించి, ఉత్తములుగాజీవించాలని ఆయన కోరారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

బాడంగి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకెండరీ గ్రేడ్ టీచర్లకు సోమ, మంగళవారాల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పి.లక్ష్మణదొర ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. తొలిరోజు వాడాడ కాంప్లెక్స్‌లో 47 మంది టీచర్లతో, రెండోరోజు కోడూరులో 50 మంది టీచర్లతో ఈ సమావేశాలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ పాఠశాల నుంచి 50 శాతం టీచర్లు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

నేడు రంగప్పవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామ సచివాలయం పరిధిలోని రంగప్పవలస పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రికాలనీలో ఉన్న వేదమాత గాయత్రీదేవి ఆలయంలో లక్ష కుంకుమార్చనలు ఆదివారం నిర్వహించారు. ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని, గాయత్రి కాలనీతో పాటు మెంటిపేట, పెనుబాక, మల్లిఖార్జునకాలనీ, రాజాం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని, విశేష పూజలు చేశారు.

పార్టీ పదవుల్లో నియమితులకు అభినందనలు


నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు పార్టీ అధిష్ఠానం ఇటీవల ప్రకటించిన జిల్లాస్థాయి నియామకాలలో పార్వతీపురం మన్యం జిల్లా తరఫున పలువురి నియామకం జరిగిందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. నియోజకవర్గం తరఫున నియమితులైన నాయకులను ఆయన ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా పార్వతీపురం మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీగా వెంపలి గురురాజు, జిల్లా పార్టీ సెక్రటరీలుగా సీతానగరం మండలం నుంచి సీనియర్ నాయకుడు పోల ఈశ్వరనారాయణ, బలిజిపేట మండలం నుంచి రంగుముద్రి గణపతిరావు, మూడు మండలాలు, పురపాలక సంఘం నుంచి ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సామంతుల మాధవనాయుడు, గులిపల్లి కృష్ణమోహన్, వేమల దానబాబు, రెడ్డి అప్పలనాయుడు, ఎండరాడ శ్రీరాములు నాయుడు, కోట సంజీవి, బత్తుల శ్రీదేవి, నడిమింటి రవీంద్రలు నియామితులైనట్లు పార్టీ అధిష్ఠానం లేఖ విడుదల చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా తమను నియమించినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డిన వారంతా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా స్వామిదయానంద సరస్వతి జయంతి


మాట్లాడుతున్న స్వామి స్వర్యానంద సరస్వతి

సీతానగరం: పరమపూజ్య స్వామి దయానందసరస్వతి జయంతి ఉత్సవాలు మండలంలోని ఎయిమ్ ఫర్‌సేవ ఛాత్రాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుడివాడ శ్రీవిద్యా పీఠాధిపతి స్వామి స్వర్యానంద సరస్వతి స్వామి దయానంద సరస్వతి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయన స్థాపించిన ఛాత్రాలయంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. ఎన్జీఓ నాయకుడు ఆర్ రామ్మూర్తి, కమిటీ ప్రతినిధి కె.అప్పారావు మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడానికి ఈ ఛాత్రాలయం పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అభ్యుదయ విద్యా సంస్థల అధినేత సీహెచ్ శారద, కొత్తా రవికుమార్, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు స్వామినాథన్ అవార్డు పట్ల హర్షం

గుమ్మలక్ష్మీపురం: రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్‌కు ప్రతిష్టాత్మక ఎంఎస్ స్వామినాథన్ పర్యావరణ పరిరక్షణ అవార్డు-2023కు ఎంపిక చేయడం పట్ల మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ గౌరవార్థం 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఈస్ట్' ఏటా ఈ అవార్డులను ప్రధానం చేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు ఆసక్తి చూపేలా తనదైన కృషి చేస్తున్న విజయ్‌కుమార్‌కు ఈ అవార్డు వరించడం సంతోషదాయకమన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయ 14వ వార్షికో త్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠ వేదమంత్రోచ్ఛరణల నడుమ అయ్యప్పస్వామికి ప్రత్యేకాభిషేకాలు, షోడశోపచార, మెట్ల పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు స్వామి అన్నప్రసాదం అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరూ కష్టించి పనిచేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందజేస్తున్నామని, ఎవరైనా మిగిలి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, మండల సచివాలయ కన్వీనర్ పల్ల అనంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో దోమల నివారణకు ఆదివారం ఫాగింగ్ చేపట్టారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంద్రేటి కేసరి పర్యవేక్షణలో గ్రామంలోని ప్రతీ వీధిలో ఫాగింగ్ చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల ద్వారా ప్రబలే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

ప్రజలకు మంచి చేయడమే రాజన్న సిద్ధాంతం

- ఆరేళ్లు ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గానికి చేసింది శూన్యం
- జిల్లా గ్రంథాలయాల ఛైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ దండి అనంతకుమారి

సాలూరు: ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ప్రజలకు సేవ చేయడమే తెలుసునని జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి అన్నారు. మండలంలోని మరిపల్లి, బాగువలస గ్రామాల్లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, సాలూరు నియోజకవర్గంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై టీడీపీ నాయకురాలు సంధ్యారాణి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన యూనివర్సిటీని కొత్తవలస పంచాయతీ రెల్లకు తరలించడానికి ప్రయత్నిస్తే సంధ్యారాణి ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. యూనివర్సిటీ గిరిజనులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో మంత్రి రాజన్నదొర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఒప్పించి సాలూరు నియోజకవర్గానికి తీసుకువచ్చారని చెప్పారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రి, కందులపథం వంతెన, పెద్దగెడ్డ రిజర్వాయర్, తదితర నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి టీడీపీ నాయకులు చేతులు దులుపుకోగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని పలుమార్లు రాజన్నదొర సవాల్ విసురుతున్నా టీడీపీ నాయకులు ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. ఆరేళ్లుగా ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి లక్షలాది మంది హాజరుకావడం, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న క్రేజ్ చూసి కేంద్ర మంత్రి ఫిదా అయ్యారని తెలిపారు. ఏనాడూ ప్రజాసంక్షేమం.అభివృద్ధిని పట్టించుకోని టీడీపీ నాయకులకు విమర్శించే అర్హత లేదన్నారు.

సమరభేరీ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: నిత్యావసర ధరల పెంపు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు దావాల రమణారావు అన్నారు. సమరభేరి పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోనికి రాకముందు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ ప్రకటించారని, ఇన్నేళ్లయినా హామీ అమలు చేయకుండా యువతను మోసం చేశారని ఆరోపించారు. నిత్యావసర ధరలు పెరిగాయని, ప్రతి వస్తువుపైన జీఎస్టీ విధించి ప్రజలపై ఆర్థిక భారం మోపారని మండిపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


కేసు విచారణ చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్

సీతంపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్ ఆదివారం సీతంపేటలో విచారణ చేపట్టారు. ఈనెల 23న హెచ్.శారద, కె.అమల స్థానికంగా ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న సమయంలో సీతంపేటకు చెందిన పి.లోకేష్ అనే వ్యక్తి కులం పేరుతో తమను దూషించినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై నీలకంఠరావు కేసు నమోదు చేయగా.. డీఎస్పీ, సీఐ విచారణ చేపట్టారు.

వరినాట్లు వేయడంపై అవగాహన

రేగిడి: వరినాట్లు వేసే రైతులు ఓ క్రమపద్ధతిలో నాట్లు వేసుకుంటే ఎంతో మేలు అని మండల ఏవో జి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని సోమరాజుపేట, ఉంగరాడ, గుళ్లపాడు, వండానపేట తదితర గ్రామాల్లో వరినాట్లు వేసే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన తాడు ఆధారంగా వరుస క్రమంలో వరినాట్లు వేసుకోవాలని, ఇలా చేయడం ద్వారా పంటకు బాగా గాలి, వెలుతురు తగలడంతో పాటు ఎరువులు, పోషకాలు బాగా అందుతాయన్నారు. తద్వారా పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి పాల్గొన్నారు.

నీటమునిగిన పంటలు


గురండి వద్ద పంటపొలాల్లో చేరిన వర్షంనీరు

భామిని: మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలు నీట మునిగాయి. వరి, పత్తి, తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వేసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు వృథాగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టాలు తప్పవని భయపడుతున్నారు.

పచ్చిమేతే పశువుకు పుష్టి

- పచ్చగడ్డి మేతతో పాలదిగుబడి మెరుగు
- పాడిరైతులు పశుగ్రాసం సాగుపై దృష్టి పెట్టాలి
- పశువైద్యశాఖ సహాయ సంచాలకులు మాణిక్యరావు




ఆరుబయట పచ్చిక మేస్తున్న పశువులు

పాలకొండ రూరల్:

పాడి పశువుకు రోజుకు 30–40 కిలోల పచ్చిమేత అవసరం ఉంటుంది. అందులో ఒక వంతు పప్పుజాతి, రెండు వంతులు ధాన్యపుజాతులను పశుగ్రాసాలుగా అందిస్తే ప్రస్తుత సీజన్‌లో మేలు చేకూరుతుందని పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభా మాణిక్యరావు తెలిపారు. పశుగ్రాసం వినియోగంలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఒక ఎకరం పొలంలో వరి పంట సాగు చేస్తే రెండు పంటల మీద గరిష్టంగా రూ.20 వేలు ఆదాయం వస్తుంది. అదే పొలంలో పశుగ్రాసాలను సాగు చేసి 4, 5 పాడి పశువుల్ని పోషిస్తే పాడి తద్వారా కనీసం రూ.50 వేలకుపైగా ఆదాయం పొందే అవకాశాలుంటాయన్నారు. పశువులకు పచ్చిమేత పుష్కలంగా అందిస్తే 5 లీటర్లలకు పైబడి పాల దిగుబడి పొందవచ్చు. ధాన్యపు జాతి పశుగ్రాసాల సాగుకు యూరియా వాడడం వల్ల దిగుబడి ఎక్కువగా లభిస్తుంది. వీటిని పూత దశలో కోసి పశువులకు మేతగా వేయడం వల్ల ఎటువంటి విషపదార్థ ప్రభావం ఉండదు.

పప్పుజాతి పశుగ్రాసాలతో..

పప్పుజాతి పశుగ్రాసాల సాగు వల్ల నత్రజని భూమిలో వృద్ధి చెందుతుంది. తద్వారా భూసారం పెరిగి నేలకోత అరికట్టబడుతుంది. కలుపు ఘననీయంగా నివారించబడుతుంది. వీటి సాగులో నత్రజని కంటే సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు వేయాల్సి ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలో జనుము సాగువల్ల 40 కిలోలు, అలసంద సాగువల్ల 30 కిలోలు, లూసర్న్ సాగువల్ల 20 కిలోలు, స్టయిలో సాగువల్ల 50 కిలోల నత్రజని సమకూరుతుంది. పశువులకు ధాన్యపుజాతి, పప్పుజాతి పశుగ్రాసాలను 2:1 నిష్పత్తిలో అందించడం వల్ల పోషక పదార్థాలన్నీ ఏకకాలంలో లభ్యమవుతాయి. ధాన్యపుజాతి పశుగ్రాసాలలో, పప్పుజాతి పశుగ్రాసాలను మిశ్రమ పంటగా సాగు చేసుకోవాలి. మిశ్రమ పంటల వల్ల పప్పుజాతి పశుగ్రాసాలు ఒకవేళ ముదిరినా నాణ్యత కలిగి ఉంటాయి. కాల్షియం వంటి ఖనిజలవణాలు లభించి వరిగడ్డిలోని ఆక్సోలేట్ల విషపదార్థాల ప్రభావాన్ని నశింపజేస్తాయి.

పాడి అభివద్ధికి దోహదం..

పాడి పరిశ్రమపై ఆధారపడే ప్రతీ రైతు పచ్చిమేత తప్పనిసరిగా సాగు చేయాలి. తమకున్న భూమిలో కనీసం 10వ వంతు భూమిని పశుగ్రాసాల సాగుకు ప్రత్యేకంగా కేటాయించాల్సిన అవసరం ఉంది. పశుగ్రాసాలు ఒక సంవత్సర కాలంలో దిగుబడి 3–4 కోతల్లో వస్తుంది. వీటిని ఏక వార్షికాలు అంటారు. వీటిని వర్షాధారంగా సాగుచేసుకోవచ్చు. బహువార్షికాలు ఒకసారి నాటితే 4–5 సంవత్సరాల పాటు పలు కోతల్లో పశుగ్రాస దిగుబడిని ఇస్తాయి. నీటి సౌకర్యం ఉన్న సందర్భాల్లో బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసుకోవచ్చు. పశుగ్రాసాల్లో ధాన్యపుజాతి, పప్పుజాతి అని రెండు రకాలున్నాయి. జొన్న జాతికి చెందినవి ధాన్యపుజాతికి సంబంధించిన పశుగ్రాసాలు. వీటిల్లో పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కంకులు ఉండడం వల్ల పిండి పదార్థాలు లభిస్తాయి. ఇక పప్పుజాతి పశుగ్రాసాలు కాయలు కాస్తాయి. వీటిల్లో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పాడి పశువులకు పచ్చిమేతను సమతులంగా అందజేయడం వలన పాడి పరిశ్రమ అవృద్ధికి దోహదపడుతుంది.

దోమలను తరిమేద్దాం..


దోమలకు ఆవాసంగా మారుతున్న ఖాళీ కొబ్బరి బొండాలు

- దోమల నివారణ మన చేతుల్లోనే..
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..


నిల్వ నీటితో ఉన్న పాతటైర్లు

వీరఘట్టం: వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో నీరు చేరి నిల్వ ఉండటం మన గమనిస్తుంటాం. నీరే కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటాం. కానీ ఆ నీరే దోమలకు ఆవాసంగా మారి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతుంది. నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటాయి. డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. మరుగుదొడ్లు, పూల కుండీలు, పాతటైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఫ్రిజ్ ట్రేలు, ఖాళీ స్థలాలు, పైపులైన్లు ఇలా.. నీరు నిల్వ ఉండేందుకు అవకాశం ఉన్న అన్ని చోట్ల దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయి. కాబట్టి ఇంటి పరిసరాలతో పాటు ఇంట్లోని అన్ని మూలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. తద్వారా దోమల ఆట కట్టించొచ్చు. వ్యాధుల వ్యాప్తికి చెక్ పెట్టొచ్చు.

ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా దోమల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు ప్రతీ శుక్రవారం డ్రైడేని నిర్వహిస్తోంది. దోమల నివారణ, సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికి ఎవరికి వారు వ్యక్తిగత బాధ్యతగా తమ ఇంటి ఆవరణాలను శుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయొద్దు



బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. వర్షపునీరు వాటిల్లో చేరడంతో లార్వాలు పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. అందుచే వీలైనంత వరకు వాడేసిన బాటిళ్లను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల నుంచి రక్షణ పొందవచ్చు.

– డాక్టర్ జె.రవీంద్రకుమార్, చిన్నపిల్లల వైద్యనిపుణులు, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

రచనలు చరిత్రకు ఆనవాళ్లు..


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రచయితలు చేసిన రచనలు పుస్తకాలు, గ్రంథాల రూపంలో చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచి ఉంటాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. 1920 నుంచి 2020 వరకు వందేళ్ల శ్రీకాకుళం రాజకీయాన్ని, ప్రాముఖ్యతను, ప్రముఖుల విశిష్టతను శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంటా లీలావరప్రసాద్ రచించా రని తెలిపారు. ప్రతీ ప్రాంతానికి ఒక విశిష్టత ఉంటుందని, అటువంటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. పోరాటాలకు పురిటిగడ్డ అయిన శ్రీకాకుళం చరిత్రను, రాజకీయ నేపథ్యాన్ని, ప్రముఖుల బయోడేటాను పూర్తిగా సేకరించి, పుస్తకాన్ని రచించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం, వంగర మండలాల కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, కరణం సుదర్శనరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, పెద్దశిర్లాం సర్పంచ్ లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.